జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు | స్థాపితం: 1930 | జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 52 • 11-12-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

లేజర్ చికిత్స
అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ళ వ్యాధులకు ప్రత్యేక చికిత్స
7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన జిల్లాలోనే సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం
డాక్టర్ అలూరు పురుషోత్తమరెడ్డి, MDS
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300



## సోనియా చిరాకు!

తెలంగాణ సమస్య చిక్కుముడి పడడం పట్ల కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చాలా చిరాకు పడుతున్నట్లు చెప్తున్నారు. తెలంగాణ ఇస్తామనే ప్రకటన చేస్తే అంతా సద్దుమణుగుతుంది, ఎక్కడా గొడవలుండవని ఆమెకు నివేదించారట సలహాదారులు. వారిని గుడ్డిగా నమ్మి చిదంబరం ప్రకటనకు అనుమతి ఇచ్చారు. కానీ తెల్లారేసరికి ఎమ్మీలు కూడా తిరుగుబాటు చేసే పరిస్థితి రావడంతో చాలా చిరాకు పడుతున్నారు. మరోకప్రక్క కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి అంత ప్రమాదకరంగా లేదని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు తనకు సమాచారం ఇవ్వనందుకు కూడా ఆమె ఆగ్రహంతో వున్నట్లు తెలుస్తున్నది. మరొకవారం రోజులైనా కెసిఆర్ ప్రాణానికి ప్రమాదం లేదని నిమ్స్ వైద్యులు ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పారట. అందువల్లనే ఆయన అసెంబ్లీ ముట్టడి తలపెట్టిన విద్యార్థి సంఘాల పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకొని, వేలాది పోలీసులను రంగంలోకి దింపాడు. కానీ కెసిఆర్ చనిపోతే రాష్ట్రం తగలబడి పోతుందని, ఏ క్షణంలోనైనా కెసిఆర్ ప్రాణానికి ప్రమాదం తప్పదని కొందరు కాంగ్రెస్ వాదులే తనకు తప్పుడు సమాచారం ఇచ్చారని సోనియా భావిస్తున్నారు.

## వెనక్కు మళ్లేదెట్లా?

కాలు జారితే వెనక్కు తీసుకోవచ్చు కానీ నోరు జారితే ఇక అంతే సంగతులన్నది పెద్దలు చెప్పే సామెత. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ అధినాయకత్వం ఆ సంకటంలోనే వుంది ఇప్పుడు. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో తమ నిర్ణయం పట్ల చెలరేగుతున్న అసంతృప్తి, ఆగ్రహ జ్వాలలను ఎట్లా నివారించాలో వారికి అర్థం కావడం లేదు. ఒకసారి తెలంగాణ ప్రక్రియ మొదలు పెడుతున్నట్లు ప్రకటన చేసిన తర్వాత మళ్లీ మాట మార్చే అవకాశం లేదు. జాతీయపార్టీగా అంత దుస్సాహసం చేయలేరు. దానివల్ల పార్టీ ప్రతిష్ఠ మంటకల్సి పోతుంది. భవిష్యత్తులో దేశంలోని

కొరవ 14వ పేజీలో

• రాష్ట్రపతి పాలనతోనే దీనికి ముగింపు

# నాటకం వికటించింది!

**కెసిఆర్‌ను మాయ చేయడానికి తెలంగాణ ప్రకటన చేస్తే, కాంగ్రెస్ మూలాలే కదిలిపోయే ప్రమాదం దాపురించింది.**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఏ కోశానా లేదు. ఎప్పటికప్పుడు ఏదో ఒక మెలిక పెట్టి సమస్యను సాగదీయడం, నానవేయడం మాత్రమే కాంగ్రెస్ అభిమతం. మొన్నటి ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆ దాగుడు మూతల ఆట కూడా మాని వేశాడు. నా గొంతులో ప్రాణం వున్నంతవరకు తెలంగాణ ఇచ్చే సమస్యే లేదని ఖరాఖండిగా చెప్తుండేవాడు వైఎస్. తెలంగాణ ప్రజలు కూడా తాము ప్రత్యేక రాష్ట్ర విభజనకు సానుకూలం కాదని మొన్నటి ఎన్నికలలో స్పష్టమైన తీర్పు ఇచ్చారు. తెలంగాణ ఇవ్వబోమని చెప్పిన కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు మెజార్టీ కట్టబెట్టి, టిఆర్ఎస్‌ను దారుణంగా ఓడించారు. ప్రజల అభిమతం అర్థం చేసుకోవడానికి అంతకంటే సంకేతం అవసరం లేదు. ఆ ఎన్నికలతో కెసిఆర్ రాజకీయ జీవితం దాదాపు సమాధి స్థితికి చేరింది. టిఆర్ఎస్ పార్టీ అపశయ్య మీద పవళించింది. టిఆర్ఎస్ తరపున గెలిచిన ఇద్దరు ఎమ్మీలలో ఒకరు; పది మంది ఎమ్మెల్యేలలో ఆరుగురు వైఎస్ పంచన చేరారు. మీతో ఇప్పుడు అవసరం లేదు కాబట్టి ఓపిక పట్టండని సలహా ఇచ్చాడు కాబట్టి, సరిపోయింది కానీ లేకుంటే ఈ పాటికి కెసిఆర్ కొడుకు, అల్లుడు తప్ప ఆ పార్టీకి శాసనసభలో ఎవరూ మిగిలి వుండేవారు కాదు.

కానీ పది రోజులలో అంతా తలక్రిందులు. చచ్చినపాము అనుకొన్న కెసిఆర్, బుస కొట్టే కోడెనాగు వలె రెచ్చిపోయాడు. ఆయన చేత నిరసన దీక్ష మాన్పించడానికి రోశయ్య ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వికటించాయి. దీక్షకు అనుమతించి వుంటే, సవాలక్ష అనారోగ్య సమస్యలతో సతమతమౌతున్న కెసిఆర్ రెండో రోజుకో, మహా అయితే మూడోరోజుకో తనను ఆస్పత్రికి తరలించడానికి సహకరించి వుండేవాడు. కానీ ఆయన దీక్ష మొదలు పెడితే బ్రహ్మాండం బ్రద్దలౌతుందని భయపడిన ప్రభుత్వం, అనవసరంగా అరెస్టు చేసింది. మరోకప్రక్క పోలీసు అధికారులు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తించేందుకు అనుమతి ఇచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మీద పాశవిక దాడి జరిపి, లేనిపోని అనర్థాలకు వూపిరి పోశారు పోలీసులు. విద్యార్థులను కొట్టారనే సాకుతో లెక్కలేనన్ని ప్రజా సంఘాలు వీధులలోకి వచ్చాయి. కెసిఆర్‌కు, టిఆర్ఎస్‌కు మాత్రమే పరిమితమై వుండిన ఉద్యమ స్వరూపాన్ని సమగ్ర తెలంగాణా పోరాటంగా మలచాయి. దానితో పరిస్థితి ప్రభుత్వం అదుపు తప్పిపోయింది. విద్యార్థులు తనను శపిస్తున్నారన్న భయంతో కెసిఆర్ కూడా ఎక్కడలేని ఓపిక తెచ్చుకొని దీక్ష కొనసాగించాడు. నిమ్స్ ఆస్పత్రిలో, పది మంది డాక్టర్ల బృందం పర్యవేక్షణలో తన ప్రాణానికి వచ్చే ప్రమాదం ఏమీ లేదని కెసిఆర్‌కు, ఆయన కుటుంబసభ్యులకు బాగా తెలుసు. అందువల్లనే 9తేది సాయంత్రం వరకు కెసిఆర్ కుమారుడు కానీ, భార్య, కుమార్తెలు కానీ ఆయన చేత దీక్ష విరమింప చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు. నోటి ద్వారా ఆహారం తీసుకోకపోవడం వల్ల కలిగే నీరసం తప్ప కెసిఆర్ ఆరోగ్యానికి వచ్చిన ఢోకా ఏమీ లేదని తెలుసు కాబట్టి వారు పెద్దగా ఆందోళన చెందలేదు. రోజురోజుకూ పరిస్థితి విషమిస్తుండడం, శాసనసభ ముట్ట

కొరవ 14వ పేజీలో

## పుండు పెట్టింది

## ముఖ్యమంత్రేనా?

ఎమ్మెల్యే రాజీనామాల పరంపరకు ముఖ్యమంత్రి రోశయ్యే శ్రీకారం చుట్టాడని విశ్వసనీయ వర్గాల భోగట్టా. 10తేది ఉదయం అసెంబ్లీకి వచ్చే వరకు ఆయనకు కానీ, కాంగ్రెస్ నేతలకు కానీ ఏమి చేయాలో పాలు పోలేదు. ఒక విధమైన దిగ్భ్రాంతితో, అయోమయంతో కెవిపితో కలిసి శాసనసభకు వచ్చారాయన. అక్కడ జెసి.దివాకర్‌రెడ్డి, డిఎల్.రవీంద్రరెడ్డి ఆయన్ను కలిశారు. ఏదో ఒకటి చేసి, కెసిఆర్ విజయాట్టహాసాలను

కొరవ 14వ పేజీలో

షైన్
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
హాస్పిటల్ ప్రత్యేకతలు
- పూర్తిగా/పాక్షికంగా కదులుతున్న పళ్ళతో బాధపడుతున్న వారికి అత్యాధునిక పద్ధతిలో ఫిక్స్‌డ్ పళ్ళు అమర్చుట.
- ఇంప్లాంటేషన్.
- ఎత్తుపళ్ళు, వంకరపళ్ళు సరిచేసే చికిత్స
- రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్.
డా॥ SK. మహమ్మద్ ఆలి
కాస్మటిక్ డెంటల్ సర్జన్
16-1064, హోటల్ వెంకటరమణ లైన్, పొగతోట, నెల్లూరు -524 001.
ఫోన్: 0861 - 2340032



● జిల్లాలో

# వరి విత్తనాలు,ఎరువుల కొరత!

**ఖరీవర్షాల కారణంగా నారుమళ్లు దెబ్బతిన్న రైతులు తిరిగి నారు పోసుకోవాలంటే విత్తనాలు అందుబాటులో లేవు. ఎరువులు, పురుగుమందులు కూడా బ్లాక్‌లో విక్రయిస్తున్నారు.**



బహిరంగ మార్కెట్‌లో దొరకని పురుగు మందులు.

జిల్లాలో వ్యవసాయసీజన్ ప్రారంభమయ్యింది. ప్రభుత్వం అధికారికంగా గతనెల 21వ తేది నుంచి పెన్నాడెల్టాకు సాగునీటిని కూడ విడుదల చేయడం జరిగింది. సాగుకు సమాయత్తం అయిన తర్వాత వూహించని విధంగా జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో నారుమళ్లు, వరినాట్లు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులు తిరిగి సాగుకు సిద్ధమవుతున్నారు. వరినాట్లు, నారుమళ్లు నీట మునిగిన ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడింది.

జిల్లాలో వ్యవసాయసీజన్ ప్రారంభం కాక ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వం



అందుబాటులో లేని వరి విత్తనాలు.

సిద్ధం చేయాలి. అయితే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటి వరకు ముందుచూపు లేకుండా వ్యవహరిస్తూ వస్తున్నారు. మార్కెట్లో అన్నిరకాల వస్తువులతోపాటు ఎరువులు, విత్తనాలు సైతం కల్తీ చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కల్తీ విత్తనాలను, రసాయనిక ఎరువులను విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదు.

## మార్కెట్‌లో నకిలీలు!

బహిరంగ మార్కెట్లో నకిలీ రసాయన ఎరువులు విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించే షాపు యాజమానుల నుంచి నెలసరి మామూళ్లు వసూలు చేసుకుంటూ నిబంధనలను తుంగలో త్రొక్కుతున్నారు. రాష్ట్ర వున్నతాధికారుల నుంచి గాని, ప్రభుత్వం వైపు నుంచి గాని ఆదేశాలు వచ్చిన సమయంలో మాత్రమే ఎరువులను విక్రయించే దుకాణాలపై దాడులు చేస్తుంటారు. మిగిలిన సమయంలో వాటివైపు కన్నెత్తి కూడా చూడరు.

### ధరల నియంత్రణపై దృష్టి!

జిల్లాలో ఎరువులు, విత్తనాలను విక్రయించే దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాల్సి వుంటుంది. అధికధరలకు విక్రయించినా లేదా ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయాలు జరుపుతుంటే మండలస్థాయి వ్యవసాయశాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి.

*జి.బాలయ్య, జాయింట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ.*

## ఎరువుల కొరత

ప్రస్తుతం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నారు. విత్తనాలు, రసాయనిక ఎరువుల కొరత వుంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు నిల్వలు వుంచడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధికధరలకు విక్రయాలు జరుపుతున్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 50 శాతం రాయితీపై వివిధ వ్యవసాయ పరికరాలను 207.04 లక్షల రూపాయల వ్యయంతో రైతులకు సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు నాలుగోవంతు కూడా పూర్తి చేయలేకపోయారు. వ్యవసాయ పరికరాల పంపిణీకి రైతుల ఎంపిక విధానంలో కూడా రాజకీయ జోక్యం మితిమీరి పోయింది.

## రాయితీపై పరికరాలేవి?

రాష్ట్రీయకృషి వికాస్‌యోజన (ఆర్‌కెవివై) పథకం ద్వారా రైతులకు భారీ యంత్రపరికరాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తామని ప్రకటించి ఆరునెలలు గడిచిపోయింది. వరికోత మిషన్లు, వరినాటు యంత్రాలు మంజూరు చేయాలంటే రైతులు రైతుమిత్ర గ్రూపులలో సభ్యులై వుండి సక్రమంగా పొదుపు చేస్తూ వుండాలి. యంత్రం పూర్తి ఖర్చులో 10 లక్షల వరకు 50 శాతం రాయితీ వ్యవసాయశాఖ ద్వారా, 40 శాతం రుణాలు బ్యాంకు ద్వారా మంజూరు చేయాలి, మిగిలిన 10 శాతం రైతుమిత్ర గ్రూపులు భరించాల్సి వుంటుంది. అయితే ఈ పథకం ఆశించినమేర జిల్లాలో అమలు జరగలేదు. అధికారులు చేసిన ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమై పోతున్నాయి.

## గ్రామ విత్తనం ఏది?

ఇదిలా వుండగా రైతులకు స్వచ్ఛమైన, నాణ్యమైన విత్తనాలను అందించాలన్న సంకల్పంతో గ్రామ విత్తనం పథకాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని జిల్లాలో ఏ మండలంలో, ఎప్పుడు ప్రారంభించారన్న సమాచారాన్ని వెల్లడించే దిక్కులేకుండా పోయింది. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అమలు చేసే పథకం ఏదికూడా గ్రామీణ ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులకు దక్కకుండా పోతున్నది. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నా రైతులకు చేరడం లేదు.

రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువులను అధికంగా వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్న ప్రచారం కూడా చేస్తుంటారు. అయితే సేంద్రీయ ఎరువుల తయారీకి అవసరమైన వర్మీకంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేయడంలో వ్యవసాయశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాకముందే ఏ పంటలు వేస్తే రైతులకు అధిక దిగుబడులు ఇస్తాయో అన్న వివరాలను రైతు సదస్సులు నిర్వహించి తెలియజేయాలి. ఇందుకు ప్రభుత్వం అవసరమైన నిధులను కూడా విడుదల చేయడం జరిగింది. సదస్సులు తూతూమంత్రంగా నిర్వహించి నిధుల స్వాహా చేసేశారు.

## కృత్రిమ కొరత

రైతుల అవసరాలను దృష్టిలో వుంచుకొని వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడకతప్పడం లేదు. జిల్లాలో రైతుల అవసరాల దృష్ట్యా 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం వుంటుంది. యూరియా 18వేల మెట్రిక్ టన్నులు, డిఏపి 8వేల మెట్రిక్‌టన్నులు, పొటాష్ వంద టన్నులు , టి.ఎస్.పి 6వేల మెట్రిక్ టన్నులు ఇతర కాంప్లెక్స్ ఎరువులు మరో నాలుగువేల మెట్రిక్ టన్నులు వున్నాయి. ఇన్ని ఎరువులు వున్నా కృత్రిమకొరత మాత్రం తప్పడం లేదు. ఒక బస్తా ఎరువులు కొనుగోలు చేస్తే మరో జింక్ గాని సల్ఫేట్‌బస్తా గాని అంట గడుతున్నారు.

50 కేజీల యూరియా బస్తా 250రూపాయలకు విక్రయించాల్సి వుండగా దీనిని 270 రూపాయలకు విక్రయిస్తున్నారు. గోదావరి డిఏపి 486 ధర వుండగా 600 రూపాయలకుపైగా విక్రయిస్తున్నారు. 28-28 రకం 390 రూపాయలు వుండగా దీనిని 550 నుంచి 650 రూపాయలు వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 17-17-17 రకం 300 రూపాయలకు బదులు 400 రూపాయలకు అమ్ముతున్నారు. 15-15-15 రకం ఎరువును 225రూపాయలకు విక్రయించాల్సి వుండగా 400 రూపాయలకు విక్రయిస్తున్నారు. అధికధరలకు విక్రయాలు జరుపుతున్న విష యాన్ని రైతులు ప్రశ్నిస్తే ఎరువులు అందుబాటులో లేవు బయట నుంచి తీసుకురావడం వలన ఖర్చులు పెరిగాయని సమాధానం చెబుతున్నారు.

బ్రాండెడ్ ఎరువులకు రైతుల నుంచి డిమాండ్ వుండడంతో కొందరు వ్యాపారులు దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. వెంకటగిరి, బాలాయపల్లి, గూడూరు, సైదాపురం తదితర మండలాల్లో కాంప్లెక్స్ ఎరువుల కొరత తీవ్రంగా వుంది. ఆత్మకూరు, కావలి, సంగం, కొండాపురం, అల్లూరు, ఇందుకూరుపేట తదితర మండలాలలో ప్రక్కదారి పడుతున్నాయి. ఈ వ్యవహారాలను చక్కదిద్దడంలో వ్యవసాయాధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

నిన్న మానవ మరియు మృగ హక్కుల దినం
డా॥ పెళ్లకూరు జె.పి.రెడ్డి
మంగుకు & సకల సెక్స్ సమస్యల కొరకై - ఫోన్ : 2329559(0861) 2333666



ఒంగోలు మాజీ పార్లమెంటు సభ్యులు మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా నెల్లూరులో నివాళులర్పిస్తున్న ఆయన అభిమానులు.



గూడూరులో కాళిదాస కళానికేతన్ అధ్యక్షుడు గౌస్‌బాషను సత్కరించి కళాబంధు బిరుదు ప్రదానం చేసిన సర్వకళామయ కళానికేతన్ నిర్వాహకులు.



అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు దర్గామిట్టలోని ది రైట్ నౌ ఫౌండేషన్‌లోని పేద పిల్లలకు దుప్పట్లు పంచుతున్న అమూల్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు వి.టోని.

## వెంకటగిరి ఎమ్మెల్యే ఆగ్రహం!

జిల్లాలో ఉపాధిహామీ పథకంలో పలు అక్రమాలు చోటు చేసుకొన్న విషయం తెలిసిందే. వీటిలో కలువాయి మండలంలో జరిగిన పనుల్లో కోట్లరూపాయల అవినీతి జరిగినా అధికారులు అవినీతిపరులపై చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఆగ్రహం తెప్పించింది. కలువాయికి విచ్చేసిన ఆయన ఎంఆర్‌ఓ, ఎంపిడివోలతో వివిధ అంశాలపై చర్చించారు. చింతలాత్మకూరు, చింతాలపాళెం, రామన్నగారిపల్లె, చీపినాపి, కెపి గోపవరం, కుల్లూరు గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భారీస్థాయిలో అవినీతి జరిగినట్లు తేలినా ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని అధికారులను నిలదీయడంతో వాళ్లు నీళ్లునమిలారు. గతంలో ఎసిబి, సోషల్‌ఆడిట్ వంటి విచారణలు జరిగినా తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల అవినీతికి పాల్పడిన ఎపిఓ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంటు బరితెగించారని ఆగ్రహించారు. వీరిని సస్పెండ్ చేయకుండా వదలివేయడం వల్ల బదలీపై వెళ్ళిపోయారని దీనికి ఎవరు కారణమనడంతో అధికారుల నుంచి సమాధానం రాలేదు. అవినీతిపరుల నుంచి తిన్నదంతా రాబట్టాలని లేకుంటే స్వయంగా ఆందోళన చేపడతానన్నారు.

• జంకుతున్న జనం

## తలబిరుసు తహశీల్దార్

పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి చీవాట్లుతిన్నా తన బుద్ధి మార్చుకోక పొగరుబోతుగా వ్యవహరిస్తూ వివాదాస్పద అధికారిగా పేరు తెచ్చుకొంటున్నాడు కలువాయి తహశీల్దార్ బాలకృష్ణారెడ్డి. కార్యాలయానికి వచ్చే వారిని నోటికొచ్చినట్లు మాట్లాడుతూ దురుదురుగా ప్రవర్తిస్తుండడంతో, తహశీల్దార్ ఆఫీసుకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారంటే ఆయన ప్రవర్తన ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. తహశీల్దార్ ప్రవర్తన స్వయంగా చూసిన జాయింట్ కలెక్టర్, ఎంపి చింతామోహన్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీవ్రఆగ్రహం వ్యక్తంచేసి తీరు మార్చుకోవాల్సిందిగా హెచ్చరించారు. ప్రజలకు మద్దతుగా కార్యాలయానికి వచ్చే నాయకులను సైతం మీరు దళారులా అంటూ తిడుతూ విరుచుకపడుతుండడంతో నిత్యం తహశీల్దార్ వ్యవహారం వివాదాస్పదమౌతున్నది. ఆఫీసులోని సమాచారం బయటకు వెళ్తున్నదనే అనుమానంతో క్రిందిస్థాయి సిబ్బందిని వేధించడం ఇతని నిత్యకృత్యమట. తనకుపడని ఓ ఆర్ఐని, మహిళా అటెండర్‌ని బదలీ చేయించి తన మాట వినకపోతే ఎవరినైనా బదలీ చేయిస్తానని బెదిరిస్తున్నాడట. తనకు వ్యతిరేకంగా వార్తలు వ్రాసే విలేకరులపైనా తప్పుడు కేసులు బనాయిస్తానంటూ బెదరించడం ఇతని నైజం. పాసుపుస్తకానికి ఐదు వేలు దండుతున్నాడు గత తహశీల్దార్ కేశమనేనిపల్లిలో నిలుపుదల చేసిన క్వారీ లీజును పెద్దమొత్తం తీసుకొని తిరిగి పర్మిషన్ ఇవ్వడం దుమారం రేగింది. తిరుమలపాడు, తెలుగురాయపురం గ్రామాల్లో పేదల భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకొన్న భూస్వాములకు వంతపాడుతూ వారి దగ్గర డబ్బులు దండుకోవడం, చనిపోయిన వారి పేరున పించన్లు దిగమింగడం ఆయన ప్రత్యేకత. ఇంతగా వివాదాస్పద వైఖరి అవలంభిస్తున్న తహశీల్దార్‌పై ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు.

## జూదశాలగా కృష్ణపట్నం పాఠశాల

• గ్రామస్తులే స్పందించాలి

ఒకవైపు పోర్టు ఏర్పాటు కావడంతోపాటు పలు విద్యుత్ పరిశ్రమల రాకతో అభివృద్ధి కేంద్రంగా మారుతున్న కృష్ణపట్నం గ్రామంలో సరస్వతి నిలయంగా భావించే పాఠశాల జూదగాళ్లకు కేంద్రంగా మారడం పలువురిని కలచి వేస్తున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కళకళలాడే ఉన్నతపాఠశాల రాత్రయితే త్రాగుబోతులకు, జూదరులకు ఆవాసంగా మారుతుండడంతో పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూలు ఆవరణలో పేకాట ఆడడం, మద్యం సేవించడం చేస్తుండడంతో ఖాళీ మద్యం బాటిళ్లు, పేకముక్కలు, గుట్కా ప్యాకెట్లతో పవిత్రమైన ఈ స్థలం కాస్త పరమగలీజుగా తయారౌతుండడంతో చూసేవారికి ఆవేదన కల్గిస్తోంది. పరిశుభ్రంగా వుండే పాఠశాల వాతావరణం కాస్తా నమిలి ఉమ్మేస్తున్న గుట్కా కిళ్లీలతో తరగతి గదులన్నీ పరమ అసహ్యంగా మారుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు బాధపడుతున్నారు. దీనికితోడు పాఠశాలలోని పలు వస్తువులు దొంగతనానికి గురౌతుండడం, పాఠశాల వాతావరణం దెబ్బతింటుండడంతో ఏమి చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో వున్నారు పిల్లలు, టీచర్లు.

## భలేమంచి చౌకబేరం

### శనగ విత్తనాలమ్ముకొన్న వ్యవసాయాధికారులు

వ్యవసాయ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేయాల్సిన అధికారులు విత్తనాల లారీలను మాయం చేయడం కొండాపురంలో సంచలనం రేపింది. సారవంతమైన నల్లరేగడి భూములున్న ఈ ప్రాంతంలో శనగ పంటను అధికంగా సాగుచేస్తుంటారు. ఈ ఏడాది ఈ పంటను వేసేందుకు అధికసంఖ్యలో రైతులు ముందుకు వచ్చారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేసేందుకు 18 లారీల విత్తనాలను పంపింది. వ్యవసాయశాఖ అధికారులు కొందరు వ్యాపారులతో కుమ్మక్కై 8 లారీల విత్తనాలను మాత్రం మండలంలోని రైతాంగానికి అందజేసి, మిగిలిన 10 లారీల విత్తనాలను అమ్ముకొన్నారట. ఒక్క లారీలోని విత్తనాలను రూ. 3.5 లక్షల వంతున రూ.35 లక్షలకు 10లారీలలోని విత్తనాలను అమ్మి సొమ్ము చేసుకోవడం పెద్ద దుమారం రేపింది. దీనిని పసిగట్టిన వింజమూరు వ్యవసాయాధికారి జాయింట్ డైరెక్టర్‌కు సమాచారం అందివ్వడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. ఈ అక్రమాన్ని బయటపడకుండా కప్పిపుచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మొత్తం 18 లారీల విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు రికార్డులు తారుమారు చేసేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## ముత్తుకూరులో మంచినీటికి కటకట

ముత్తుకూరు మండలంలోని పలుగ్రామాల ప్రజలను మంచినీటి కొరత పట్టిపీడిస్తోంది. నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిరావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేలటూరు, కృష్ణపట్నం, గోపాలపురం, ఆర్కాట్‌పాళెం, రామ్‌నగర్ తదితర ప్రాంతాల వారు మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నేలటూరు పంచాయితీ ప్రజలు నీటికోసం నానా అగచాట్లు పడాల్సివస్తోందని వాపోతున్నారు. పనులన్నీ మానుకొని నీళ్లను తెచ్చుకొనేందుకు మైళ్లదూరం వెళ్ళాల్సివస్తోందని బాధపడుతున్నారు గ్రామస్తులు. ట్యాంకరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా అవి అరకొరగా మాత్రమే వుంటుంది తప్ప సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని పలు ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్లకు ట్యాంకరు వచ్చినా నేతల పలుకుబడిగల వారికి మాత్రమే నీరు అందుతుంది తప్ప సామాన్య జనానికి అందదడం లేదన్నది ఈ ప్రాంత ప్రజల ఆరోపణ. మంచినీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికార్లకు మొరపెట్టుకొన్నా ప్రయోజనమే లేదని ఇప్పటికైనా తమ గోడును అర్థం చేసుకొని నీటి సమస్య నివారించాలని కోరుతున్నారు మండల ప్రజలు.

# ఆత్మకూరులో పేరుకున్న సమస్యలు!

ఆత్మకూరు నియోజకవర్గానికి మంత్రి నియోజక వర్గమని పేరు తప్ప అక్కడ సమస్యలు మాత్రం ఒక్కటీ పరిష్కారానికి నోచుకోకపోవడం ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నది. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేజిక్కించుకోవడంతో ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి పథాన ముందుంటుందని ఆశపడ్డ ప్రజలకు ఆశ నిరాశ అయ్యింది. ఎన్నికల తర్వాత మంత్రి నియోజకవర్గం గురించి పట్టించుకోకపోవడం, జిల్లాకు వచ్చినా నెల్లూరుకే పరిమితం అవుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి రగులుతోంది. గతంలో ఇక్కడి నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలను చెప్పుకొనే అవకాశం వుండేదని, ఆనం రామనారాయణ వద్దకు నేరుగా వెళ్లి కలిసే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

## పట్టించుకోని మంత్రి

ఆత్మకూరు, అనంతసాగరం, అనుమసముద్రంపేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో ప్రధాన సమస్యలు ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోలేదు. ఆనం వచ్చిన తర్వాత అయినా అభివృద్ధి వేగిరం అవుతుందని ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. మండల పరిధిలోని బట్టేపాడు, కరటంపాడుల వద్ద బొగ్గేరుపై వంతెనల నిర్మాణం, అనంతసాగరం మండలంలోని గుడిగుంట, ఎగువపల్లి సమీపంలో కేతామన్నేరువాగుపై ఫ్లైఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిని 160 పడకల ఆస్పత్రిగా మార్చడం, సీమాంక్ సెంటర్‌లో వైద్యుల నియామకం లాంటి హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది.

# శిథిలమైన పాఠశాల

విద్యార్థులకు చక్కని విద్యను అందించాలన్న లక్ష్యంతో కోవూరు పెళ్లకూరు రామచంద్రా రెడ్డి కాలనీలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకొనింది. మూడు దశాబ్దాల క్రిందట కట్టిన ఈ పాఠశాల భవనం ఆలనాపాలనా లేకపోవడంతో శిథిలమై కూలిపోయే స్థితికి చేరుకొన్నది. పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో పిల్లలు భయాందోళనలు వ్యక్తం

## బిక్కు బిక్కుమంటున్న ఉపాధ్యాయులు, పిల్లలు

చేస్తున్నారు. ఎప్పుడు భవనం కూలిపోతుందోనన్న భయం విద్యార్థులను, ఉపాధ్యాయులను వెన్నాడుతోంది. దీనికి తోడు వర్షం వస్తే పాఠశాల చుట్టూ నీరు చేరుతుండడంతో విద్యార్థులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. మరుగుదొడ్లు అధ్వాన్నంగా వుండడంతో బాలికలు తీవ్ర అసౌకర్యానికి గురి కావాల్సి వస్తున్నది.

# పొదుగుతున్న కోడిపుంజు

కోడిపెట్ట గుడ్లను పొదిగి పిల్లల్ని చేస్తుంది. ఇది జగమెరిగిన సత్యం. ఇందుకు విరుద్ధంగా కోడిపుంజు కూడా గుడ్లను పొదగడం చర్చనీయాంశమైంది. ఈ విచిత్రం మండల కేంద్రమైన బోగోలులో చోటు చేసుకొంది. పంచాయితీ పరిధిలో గల చెంచులక్ష్మీపురంలో షేక్ బాషా కోళ్లను పెంచు

## బోగోలులో విచిత్రం

తుంటాడు. ఇటీవల కోడిపెట్ట 14 గుడ్లు పెట్టింది. వాటిలో కొన్నింటిని పెట్ట పొదగ్గా, మరికొన్నింటిని కోడిపుంజు పొదగడం చూసి గ్రామస్తులు విస్తుపోయారు. ఈ వింతను చూడడానికి గ్రామస్తులతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల వారు సైతం అధికసంఖ్యలో వస్తున్నారు.

# పశుక్రాంతి భ్రాంతే

పల్లెల్లో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశుక్రాంతి పథకం అధికారుల వైఫల్యంతో పశుమరణాల పథకంగా మారింది. వేరు వేరు ప్రాంతాల నుంచి తీసుకొని వచ్చిన పశువులకు వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడడం, ప్రత్యేకమైన దాణా లేకపోవడంతో అధికసంఖ్యలో పశువులు కలవకూరు, జంగాలపల్లి, పాల్చూరు గ్రామాల్లో 35 మందికి గేదెలను అందజేశారు. రోజుకు 10 లీటర్ల పాలిస్తాయని వ్యవసాయాధికారులు వీటిని తీసుకొని వచ్చారు. లబ్దిదారులు నెలకు 500 రూపాయల లెక్కన బ్యాంకులకు చెల్లించాల్సి వుంటుంది. వీటికి పశుసంవర్థక శాఖాధికారులు వైద్య సహాయాన్ని, దాణాను అందించాల్సి

## ఎక్కువవుతున్న పశుమరణాలు

చనిపోతున్నాయి. వేలరూపాయలు పెట్టి కొనుగోలు చేసిన గేదెలు కళ్లెదుటే మరణిస్తుండడంతో లబ్దిదారులు దిక్కుతోచని స్థితిలో వున్నారు. తమిళనాడులోని కారూరు ప్రాంతం నుంచి పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు, దావాలి, తాళ్వాయిపాడు, కప్పగుంటకండ్రిగ, వుంది. క్రొత్తలో ఒకటి రెండుసార్లు దాణా ఇచ్చిన అధికారులు ఆ తర్వాత ఆ సంగతి పట్టించుకోకపోవడంతో పలుగ్రామాల్లో పశుక్రాంతి పథకం క్రింద అందజేసిన గేదెలు మరణించాయి. దీంతో రుణం ఎలా తీర్చాలన్న దిగులుతో లబ్దిదారులు క్రుంగి పోతున్నారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ముందు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు.



వికలాంగుల దినోత్సవం సందర్భంగా నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న మేయర్ భానుశ్రీ. ప్రక్కన నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి వున్నారు.

రాజుపాళెంవాసుల బాధ వర్ణనాతీతం

# డంపింగ్‌యార్డ్ దుర్గంధ భరితం

నగరపాలక సంస్థ చెత్తనంతటిని రూరల్‌మండల పరిధిలోని రాజుపాళెం డంపింగ్‌యార్డుకు తరలిస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా తయారైంది. ఎటుచూసినా నెల్లూరు నుంచి తీసుకవచ్చి పోస్తున్న చెత్తతో ఆయా ప్రాంతాల ప్రజలు భరించలేని దుర్గంధంతో బాధపడుతున్నారు. వర్షాకాలంలో అయితే ఈ పరిస్థితి మరింతగా దిగజారుతుండడంతో రాజుపాళెం, తోటపల్లిగూడూరు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. నగరపాలక సంస్థ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుకు సంబంధించి నిర్దిష్టమైన నియమం పాటించకపోవడం చుట్టుప్రక్కల ప్రాంత ప్రజల పాలిట శాపంగా మారింది. చుట్టూ ఎత్తైన ప్రహరీగోడలు నిర్మించడంతోపాటు దుర్గంధం వెదజల్లకుండా తగినచర్యలు చేపట్టాల్సివున్నా అలాంటి చర్యలు ఏమీ చేపట్టకపోవడంతో కాలుష్యం, దుర్గంధాలతో ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని ఈ ప్రాంతవాసులు హడలిపోతున్నారు. డంపింగ్ యార్డును ఈ ప్రాంతం నుంచి తరలించి బాధల నుంచి విముక్తి కల్గించాలని స్థానికులు పాలకులను వేడుకొంటున్నారు.

## ప్లాస్టిక్ కవర్లపై వాసవిక్లబ్ యుద్ధం

ప్లాస్టిక్ వస్తువుల వాడకం వలన పర్యావరణం దెబ్బతింటుందని శాస్త్రజ్ఞులు పదే పదే హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం క్యారీబ్యాగులపై నిషేధం విధించినా వాటి వినియోగం ఆగటం లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తూ వున్నాయి. దీనికి భిన్నంగా కావలి వాసవి వనిత క్లబ్ మహిళలు ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేసి గుడ్డసంచులు, కాగితం సంచులను వాడుతూ వాటి గురించి ప్రచారం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని కోరుతూ అందుకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు నడుంబిగించారు. షుమారు 55 మంది వాసవి వనిత క్లబ్ సభ్యులు కావలిలో దీనిపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వారు సొంత ధనాన్ని వెచ్చించి గుడ్డసంచులను తెచ్చి పాఠశాలలు, షాపులలో అందజేస్తూ చైతన్యం నింపడం అభినందనీయం. వీరు చేస్తున్న మంచిపని చూసైనా ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గిస్తే అందరికి మంచిది.

## 'చిరు' డిప్రెషన్



ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు చిరంజీవి డిప్రెషన్‌లో వున్నాడట. పార్టీ ప్రారంభించి తొలి వార్షికోత్సవం మాత్రమే గడిచింది. ఈ కొద్ది కాలంలోనే పార్టీ నాయకులంతా ఒక్కొక్కరుగా బయటకి వెళ్లిపోవడంతో ఇప్పుడు పార్టీ వెలవెలబోతోంది. హరిరామజోగయ్య, కత్తి పద్మారావు వంటివారు కూడా పార్టీకి రాజీనామా చేయడం 'చిరు' జీర్ణించుకోలేకపోతున్నారట. ఆయన కనబడిన వారందరికీ చెప్పుకొంటున్నాడు. అసెంబ్లీలో కూడా మునుపటి ఉత్సాహం కనబడటంలేదు. పార్టీ ఎమ్మెల్యేలు కూడా తలోదారి చూసుకుంటున్నారు. శోభా నాగిరెడ్డి యిప్పటికే జగన్ శిబిరంలో చేరిపోయారు. పార్టీ కేడర్ కూడా అనాసక్తి ప్రదర్శిస్తుండడంతో 'చిరు' ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడట. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో 60 స్థానాలకు పోటీ చేస్తే కేవలం ఒకే ఒక్క స్థానంలో మాత్రం గెలుపొందటం 'చిరు'ను తీవ్రంగా కలచివేసిందట. పాపం! 'చిరు' ఈ డిప్రెషన్ నుంచి ఎలా బయటపడతాడో అంటూ అల్లు అరవింద్ మొత్తుకుంటున్నాడట.

## బామ్మర్ది ఓవర్ యాక్షన్



వైఎస్ బామ్మర్ది, కడప మేయర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఓవర్ యాక్షన్ చేసి చివరకు నాలుక కరుచుకున్నాడు. ప్రస్తుతం రాష్ట్ర సంక్షోభాన్ని రోశయ్య నివారించలేదని, జగన్‌కు మాత్రమే అది సాధ్యమంటూ రవీంద్రనాథ్‌రెడ్డి స్టేట్‌మెంట్ యిచ్చాడు. పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వైఎస్ సతీమణి త్వరలో రాజీనామా చేస్తారని, జగన్ పులివెందుల నుంచి ఎమ్మెల్యే అవుతాడని రవీంద్రనాథ్‌రెడ్డి ముక్తాయింపు ఇవ్వడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశమయ్యింది. దీనిపై ఎమ్పీ విహెచ్ తీవ్రంగా స్పందించాడు. రోశయ్యను దించి జగన్‌ను సిఎం చేయాలన్న రవీంద్రనాథ్‌రెడ్డి ఆలోచన దుర్మార్గంగా వుందని, దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని విహెచ్ డిమాండ్ చేశాడు. వూహించని ఈ పరిణామానికి రవీంద్రనాథ్‌రెడ్డి దిగివచ్చి ఆ తెల్లారే, తాను అలా అనలేదని, రోశయ్య సిఎంగా ఎంతో సమర్థుడంటూ కితాబిచ్చాడు. రవీంద్రనాథ్‌రెడ్డి ఈ ఓవర్ యాక్షన్‌కు సొంత శిబిరంలోని వాళ్లు కూడా 'ఛీ' కొట్టారట!

## రెంటికీ చెడిన రేవడి 'రాములమ్మ'



మెదక్ ఎమ్పీ, సినీనటి విజయశాంతి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. తల్లి తెలంగాణ పార్టీని టిఆర్ఎస్‌లో విలీనం చేసి మెదక్ ఎమ్పీగా గెలిచిన విజయశాంతి ఆ తర్వాత కెసిఆర్‌తో విభేదించి పార్టీకి దూరంగా వుంటోంది. వైఎస్ సిఎంగా వున్నప్పుడు ఒకదశలో కాంగ్రెస్ తీర్థం తీసుకోవాలనే ఆలోచన కూడా చేసింది. అయితే ఈలోగా వైఎస్‌కు ప్రమాదం జరగడం వల్ల విజయశాంతి మౌనంగా వుండిపోయింది. కెసిఆర్ దీక్షలో తెలంగాణ అంతా అట్టుడికిపోవడంతో విజయశాంతి తిరిగి తెరపై ప్రత్యక్షమైంది. కెసిఆర్‌ను పరామర్శించడానికి నిమ్స్‌కు వెళ్లింది. అయితే అక్కడ ఆమెకు కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. తెలంగాణకు అనుకూలంగా రాజీనామా చేయాలంటూ ప్రదర్శనకారులు నిలదీయడంతో ఆమె ఖంగుతింది. అవసరమైతే రాజీనామా చేస్తానంటూ అక్కడి నుంచి జారుకుంది. అటు కాంగ్రెస్‌లోకి వెళ్లలేక ఇటు తెలంగాణ పోరాటంలో భాగస్వామి కాలేక విజయశాంతి నలిగిపోతోందట. చేసుకున్నవారికి చేసుకున్నంత అంటే ఇదేనేమో!

## కెవిపి నిర్వేదం



వైఎస్ లేనిలోటేమిటో కెవిపికి బాగా తెలిసొస్తోంది. గతంలో వైఎస్‌తో సమానంగా గౌరవ మర్యాదలందుకున్న కెవిపి కథ ఇప్పుడు అడ్డం తిరిగిందట. ఢిల్లీలో ఇప్పుడు కెవిపిని ఎవరూ పట్టించుకోవడం లేదట. గతంలో మాదిరిగా ఇప్పుడు తనను ఎవరూ పిలిచి మాట్లాడటం లేదని ఆయన నిర్వేదం వ్యక్తం చేస్తున్నాడు. వైఎస్ లేకపోవడం వల్ల తాను వరండాలకే పరిమితం కావల్సివస్తోందని, చూసిన వారంతా తనను 'వరండా బ్యాచ్' అంటూ హేళన చేస్తున్నారని మొత్తుకుంటున్నాడు. పార్లమెంట్ లాబీల్లో కూడా కెవిపికి నిరాదరణే వుందట. అందుకే అసెంబ్లీ లాబీల్లో కెవిపి హడావుడిగా కనిపిస్తున్నారట. తనకు ఏ పనిలేకపోయినా కూడా మధ్యలో వచ్చి కల్పించుకుంటున్నారట. అసెంబ్లీ లాబీల్లో మంత్రి నాగేందర్ విలేకరులతో మాట్లాడుతూ వుంటే కెవిపి హాజరయ్యాడు. అలాగే రోశయ్య ఎక్కడికెళితే అక్కడ కెవిపి కూడా కనిపిస్తున్నాడు. అసెంబ్లీలో ఎవరు కనిపించినా కూడా పనిగట్టుకొని పలకరిస్తున్నాడట కెవిపి. పూలమ్మిన చోటనే కట్టెలమ్మడమంటే ఏమిటో కెవిపికి బాగా తెలిసొస్తున్నట్లుంది.

## జగన్ ఖంగుతిన్న వేళ



రాజకీయాలంటే ఏమిటో 'జగన్'కు ఇప్పుడిప్పుడే తెలిసివస్తున్నాయట. కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని అధికారం చలాయించిన జగన్‌కు 'తెలంగాణ వాదం' ఎదురు తిరిగింది. ఢిల్లీలో తెలంగాణకు సంబంధించి వీరప్ప మొయిలీ రాష్ట్ర ఎమ్పీల సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సమావేశానికి తెలంగాణా ఎమ్పీలను మాత్రమే ఆహ్వానించారట. అయితే జగన్ కూడా అత్యుత్సాహంతో ఈ సమావేశానికి హాజరయ్యాడు. సమావేశంలో తెలంగాణ ఎమ్పీలంతా ప్రత్యేక రాష్ట్రం కావాల్సిందేనంటూ వాదించగా జగన్ కల్పించుకొని 'అసలు తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్రం సెంటిమెంట్ అంతగా లేదంటూ సన్నాయి నొక్కులు నొక్కాడట. దాంతో ఎమ్పీలకు చిర్రెత్తుకొచ్చి 'జగన్' ఎక్స్‌ట్రా పాత్రను ప్రశ్నించారట. తనను సమర్థించే అస్మదీయ ఎమ్పీలు కూడా జగన్ ప్రవర్తనపై పెదవి విరిచారు. దీంతో జగన్ నోటికి తాళం వేసుకోక తప్పలేదట. జగన్ ఈ సమావేశానికి రావడంతో మధుయాష్కీ అలిగి గైర్హాజరయ్యాడు.

## ఈ 'హోం' నాకొద్దు!



హోం మంత్రి పదవి తనకొద్దంటూ సబితా ఇంద్రారెడ్డి చేతులెత్తేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేయడంతో సబిత తీవ్రమనస్తాపానికి గురైందట. పోలీసులు యిలా బాదేస్తే హోంమంత్రిగా తనపై వ్యతిరేకత వస్తోందని, తనను 'హోం' నుంచి తప్పించాలంటూ రోశయ్యకు మొరపెట్టుకుంది. ఒకదశలో ఒత్తిడి తట్టుకోలేక హోంమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించింది. అయితే రాజకీయాల్లో ఇవన్నీ మామూలేనని, కొంతకాలం వేచివుండాల్సిందిగా రోశయ్య బుజ్జగించడంతో సబిత తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అయితే విద్యార్థులకు తను సమాధానం చెప్పాలి కాబట్టి ఈ ఘటనకు బాధ్యుడైన పోలీసు అధికారి స్టీఫెన్ రవీంద్రను బదిలీ చేయాలని కోరిందట. రోశయ్య ఆమె మాటను మన్నించి స్టీఫెన్‌ను క్షణాలపై బదిలీ చేశాడు. దీంతో సబిత శాంతించింది.

## రోశయ్యకు వాస్తు దోషం



సిఎం రోశయ్యకు వాస్తు దోషం వుందా? ప్రస్తుత సిఎం కార్యాలయంలో ఇదే విషయమై తీవ్రమైన చర్చ జరుగుతోంది. రోశయ్య సిఎం అయ్యారో లేదో రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు ముంచుకొచ్చాయి. ఆ వెంటనే కెసిఆర్ దీక్ష వహించడం, ప్రత్యేకరాష్ట్రం కోసం తెలంగాణ అట్టుడకడం అంతా వాస్తు దోషమేనని చెబుతున్నారు. ఓవారం రోజులుగా వాస్తుదోష నివారణ కోసం ఓ సిద్ధాంతి తలమునకలై వున్నాడట. సిఎం కార్యాలయంతోపాటు, ప్రస్తుతం ఆయనుంటున్న నివాసానికి వాస్తు ప్రకారం ఏమైనా మార్పులు - చేర్పులు చేయాలా? అన్న విషయమై నిపుణుల సలహాలను కూడా తీసుకోవాలనుకుంటున్నారట.

## 'గీత' దాటిన నన్నపనేని



చంద్రబాబుపై గుర్రుగా వున్న ఎమ్మెల్యే నన్నపనేని రాజకుమారి మళ్లీ గీతదాటారు. మంగళవారం జరిగిన పార్టీ మీడియా కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక తెలంగాణ అంశం ప్రస్తావన కొచ్చింది. దాంతో చంద్రబాబు కలుగజేసుకొని ఈ విషయంపై ఎవరూ నోరు మెదపకూడదంటూ ఆదేశించాడు. నన్నపనేని కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో వున్నారట. అయితే వీడియో కాన్ఫరెన్స్ ముగిశాక విలేకరులు నన్నపనేని చుట్టుముట్టారు. ప్రత్యేక రాష్ట్రంపై అభిప్రాయాన్ని అడిగారట. దాంతో నన్నపనేని తీవ్రస్వరం చేసుకొని తాను ఇప్పటికీ, ఎప్పటికీ సమైక్యవాదినేనంటూ స్టేట్‌మెంట్ యిచ్చింది. పనిలో పనిగా హైదరాబాదుకు తెలంగాణతో సంబంధం లేదని, హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని మంత్రి దానం నాగేందర్ చేస్తున్న వాదనకు వత్తాసు పలికింది. హైదరాబాదు ఏ ఒక్కరిదీ కాదని, ఇది అందరి ఆస్తి అంటూ నన్నపనేని నొక్కి చెప్పడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశమైందట.

## ఎస్పీని కుట్టిన దోమలు



నెల్లూరు నగరంలోని జనం వైరల్, టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగీ జ్వరాలతో సతమతమై పోతున్నారు. కార్పొరేషన్, వైద్య, ఆరోగ్యశాఖాధికారులు మాత్రం జ్వరాలు, గిరాలు లేవంటున్నారు. దుర్భేద్యమైన కోటను తలపించే పొదలకూరు రోడ్డులోని తన బంగళాలో వుండే ఎస్పీ మల్లారెడ్డిని సైతం చికున్‌గున్యా జ్వరకారకమైన దోమ కుట్టింది. ఈ విషయం బయటకు పొక్కకుండా ఆయన నగరంలోని బొల్లినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేరారు. కలెక్టర్ ఇతర ముఖ్యులు ఆయనను పరామర్శించను వెళ్లడంతో విషయం బయటపడింది. మొత్తానికి నెల్లూరు ప్రశాంతమని ఇక్కడ డ్యూటీని ఇష్టపడే మల్లారెడ్డి గారు జీవితంలో ఈ నగరాన్ని, తనకొచ్చిన జ్వరాన్ని మరచిపోరనాలి.

## ఎసి సెంటర్‌లో మురుగు సెలయేరు



నెల్లూరు ఎసి సెంటర్ అంటే ఆనం కుటుంబీకుల ఇంటిముందు సెంటర్. ఈ ప్రాంతంలోనే రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ఆయన సోదరుడు జయకుమార్ రెడ్డిల స్వగృహముంది. ఈ ప్రాంతానికి కాసింత దూరంలో పుర పాలక మంత్రి రామనారాయణరెడ్డి నివాసం కూడా వుంది. ఈ సెంటర్‌లో ఆనం కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిన ఎసి సుబ్బారెడ్డి విగ్రహానికి వుత్తరంవైపు మురుగుకాల్వ పొట్ట పగిలి తరచూ ఈ ప్రాంతంలో మురుగునీరు సెలయేరులా ప్రవహిస్తోంది. ఎండా, వర్షాకాలమన్న తేడా లేకుండా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. నగరాన్ని సుందరవనం చేస్తామని అరిగిపోయిన రికార్డు తరచూ వేస్తుండే బ్రదర్స్ ముందు తమ సెంటర్‌లో పరిస్థితులు చక్కదిద్దుకోవాలని ప్రజలు సలహాయిస్తున్నారు.

## నిఖార్సైన నాయకిని



జిల్లాలోని మెట్ట ప్రాంత మండలం నుంచి వచ్చి ఆరు నెలల క్రితం నెల్లూరు నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నందిమండలం భానుశ్రీ విపరీతంగా సంపాదిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆమెపై విచారణకు ఆదేశించింది. కాని విచారణను మేయరమ్మ లైట్‌గా తీసుకొన్నట్లుంది. కన్నబిడ్డలు తప్పుచేస్తేనే ఊరుకోను. కార్పొరేషన్‌లో నేను తప్పులు చేయడమేమిటి? ఏం చేసినా నిబంధనల మేరకే చేశా. గిట్టనివాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆరునెలలకే ఎవరైనా 110కోట్లు సంపాదిస్తారాండి అని ఆమె విలేకరులను ఎదురు ప్రశ్నించడంతో ఆశ్చర్యపోవడం వారివంతయ్యింది.

## నెల్లూరు టూ బ్యాడ్



కలెక్టర్ రామ్‌గోపాల్ మెత్తటి మనిషి. జిల్లా అధికార గణం ఎన్ని తప్పులు చేసినా ఆయన వాళ్లను పెద్దగా మందలించిన సాదృశ్యం లేదు. అటువంటి వ్యక్తి ఈ వారంలో తన బంగళాలో మునిసిపల్, వైద్యఆరోగ్య శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరు నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి మీరేం చేస్తున్నారని మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. వ్యాధిగ్రస్తులకు చికిత్సలు సరిగ్గా చేయలేక పోతున్న వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆయన మందలించారు. నెల్లూరు టూ బ్యాడ్... ఐ యామ్ నాట్ హ్యాపీ. దీనికన్నా వెనుకబడ్డ ఒంగోలు టౌన్ బెటరని కలెక్టర్ చెప్పడంతో అధికారులు నీళ్లు నమిలారు.

## మానవాళికి శాంతిసందేశాన్నిచ్చే క్రిస్మస్!



ప్రపంచవ్యాప్తంగా క్రిస్టియన్లు అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగ క్రిస్మస్. లోకానికి శాంతిప్రవచనాలను అందించిన యేసుక్రీస్తు పుట్టిన రోజైన డిసెంబర్ 25 తేదిని క్రిస్మస్ పండుగగా జరుపుకోవడం ఆనవాయితీ. క్రీస్తు ఈ లోకంలో జన్మించి ఇంచుమించుగా 2009 సంవత్సరాలు అయ్యిందని భావిస్తున్నారు. జగత్తుకు పునాది వేయకముందే క్రీస్తు వుండినాడనేది పలువురి నమ్మకం. కన్యయైన మరియు గర్భాన క్రీస్తు జన్మించడాన్ని దేవదూత జననంగా భావించారు అందరూ. బెత్లెహేములో పశువులపాకలో పుట్టిన క్రీస్తు లోకరక్షకుడుగా ప్రసిద్ధి చెందాడు. సర్వలోకపాప నివారణకు, అపవాదిక్రియలను లయపరుచుటకు, నశించిన దానిని వెదకి రక్షించుటకు ప్రాయశ్చిత్తంగా శిలువ వేయించుకొని తన ప్రాణాలను బలి ఇచ్చిన శాంతిదూత యేసుక్రీస్తు, కల్వరికొండపై ప్రాణాలర్పించిన ఆయన మూడవరోజు తిరిగి పునరుద్ధానం చెంది తనవారిని కాపాడేందుకు అనునిత్యం రక్షకునిగా నిలచాడనేది జనుల నమ్మకం. క్రీస్తు పుట్టిన రోజును క్రిస్టియన్లందరూ వేడుకగా జరుపుకొంటారు. ఉదయాన్నే చర్చికి వెళ్లి ప్రార్ధనలు చేసి, పేదలకు అన్నదానం చేస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తారు.



క్రిస్మస్‌రోజు చిన్నారులకు క్రిస్మస్‌తాత గుర్తుకొస్తాడు. శాంతక్లాజ్‌గా పిలువబడే ఆయన విచిత్ర వేషధారణతో చిన్నారులకు బహుమతులను అందజేస్తాడని ప్రతీతి. క్రిస్మస్ ముందురోజు నుంచే చర్చిలు, ఇళ్లను విద్యుద్దీపాలతో, క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లతో అలంకరించడం చేస్తారు.


## సంస్మరణ

ఎందరికో చేయూతగా నిలచి, వారి కుటుంబాలలో వెలుగులు నింపిన మార్గదర్శకులు



శ్రీ జక్కా రాధాకృష్ణారెడ్డి
(రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, APSRTC, Hyderabad)



శ్రీమతి జక్కా సుజాతమ్మ

ఆ పుణ్య దంపతులను స్మరించుకుంటూ...

తల్లి - జక్కా కామేశ్వరమ్మ

**సోదరులు**

జక్కా కోదండరామిరెడ్డి - సులోచనమ్మ
జక్కా శ్రీనివాసులురెడ్డి -
జక్కా శివనారాయణరెడ్డి - లక్ష్మీప్రసన్న

**కుమార్తెలు - అల్లుళ్లు**

కల్పన - ఏనుగ మురళీమోహన్‌రెడ్డి
అనురాధ - కారెంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

**మనుమలు - మనుమరాండ్రు**

ఏనుగ పూజిత, ఏనుగ రోహన్‌రెడ్డి, కారెంపూడి రవితేజ, కారెంపూడి సుజాత

# రాజుపాళెంలో అభివృద్ధి అంతంత మాత్రం!

కొడవలూరు మండలం నార్తురాజుపాళెం గ్రామ పంచాయితీ ఆశించిన మేర అభివృద్ధి చెందలేకపోయింది. ఈ గ్రామ పంచాయితీ కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వుంది. ఇప్పటి వరకు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పలువురు ఎమ్మెల్యేలు నార్తురాజుపాళెంను అభివృద్ధి చేసేందుకు పెద్దగా కృషి చేయలేదని చెప్పొచ్చు. 5వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని వున్న నార్తురాజుపాళెం మధ్య నుంచి నిత్యం రవాణా కొనసాగుతుంటుంది. రవాణా సౌకర్యం వున్న గ్రామాలు అభివృద్ధి చెందాలి.

అయితే నార్తురాజుపాళెం గ్రామపంచాయితీ మూడు విభాగాలుగా విస్తరించి వుంది. ఊరు ఒక ప్రాంతం బుచ్చి వైపు వెళ్లే రోడ్డులో ఒక దళితవాడ, అలాగే వ్యాపారకూడలిగా వున్న ప్రాంతంలో మరో దళితవాడలు ఏర్పాటై వున్నాయి. మండల కేంద్రంగా కొడవలూరు వున్నప్పుడికి ప్రతి పనికి మండల ప్రజలందరూ నార్తురాజుపాళెంకు వస్తుంటారు. వ్యాపార కూడలి దళితవాడలో వున్నకారణంగానే అభివృద్ధి పరచేందుకు పాలకులు ముందుకు రావడం లేదన్న వాదన వినిపిస్తుంది. అదే ఊరు మధ్యలో ఇదే కూడలి వుంటే ఎలా వుండేదో చెప్పలేమంటున్నారు స్థానికులు.

పంచాయితీ పరిధిలో 1800 కుటుంబాలు 8వేల జనాభా, 3వేల ఓటర్లున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వీరి కళ్యాణి గ్రామ సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈమె భర్త వీరి చలపతి జడ్పీటీసీ సభ్యునిగా కొనసాగుతున్నారు. భర్త సహకారంతోనే పంచాయితీకి అధికశాతం నిధులు మంజూరు చేయించుకోగలిగింది. గడచిన నాలుగు సంవత్సరాలలో దాదాపు కోటిరూపాయలకు పైగా పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనులు జరిగాయి. వాటర్‌ట్యాంక్ నిర్మాణం, సిమెంటు రోడ్ల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు చేయడం జరిగింది.

ఎస్‌ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు కలిపి 2లక్షల 50వేలు, ఇంటి పన్నుల రూపంలో 8లక్షలు, సెస్సు రూపంలో మరో 2 లక్షలు పంచాయితీ రాబడిగా వుంది. ఈ క్రమంలో పంచాయితీ అభివృద్ధి, సమస్యలపై స్థానికులువెల్లడించిన అభిప్రాయాలను ప్రకనిస్తున్నాం.



నార్తురాజుపాళెం గ్రామ పంచాయితీ కార్యాలయం.

### మరింత అభివృద్ధి



గ్రామ పంచాయితీ అభివృద్ధికి నావంతు కృషి చేస్తున్నాను. గడిచిన నాలుగు సంవత్సరాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సమస్యలను పరిష్కరించడంతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. పాలకవర్గంతోపాటు, పంచాయితీలోని ప్రజలందరు కూడా సహకరిస్తున్నారు.

– వీరి కళ్యాణి, సర్పంచ్

### వ్యాపార కూడలిని అభివృద్ధి చేయాలి!



నార్తురాజుపాళెం దళితవాడకు ఆనుకొని వున్న వ్యాపారకూడలిని అభివృద్ధి చేసేందుకు అధికారులు, పాలకులు తగిన చర్యలు తీసుకోవాలి. అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేసినా ఇక్కడ మాత్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా వెలసి ఫీజుల పేరుతో జనం జేబులకు చిల్లులు పెడుతున్నారు.

– దేవానందం, వార్డు సభ్యుడు

అవినీతి కథ

# అక్రమార్జనలో ఆరితేరిన శానిటరీ ఇన్స్‌పెక్టర్లు!



లంచం తీసుకొంటూ ఏసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ శానిటరి ఇన్స్‌పెక్టర్.

ప్రజాధనం అంటే అందరికీ అలుసే. ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉన్నతాధికారుల నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతోపాటు వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను లంచాల కోసం జలగల్లా పట్టిపీడిస్తుంటారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని ప్రభుత్వం ఏమీచేయడం లేదన్న ధీమా అక్రమార్కుల్లో బాగా నాటుకుపోవడం దీనికి కారణం. అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి పాల్పడే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదు.

ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా, అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడులు చేసిన సమయంలో సంపాదనకు మించి ఆస్తులు కలిగివున్నా, లేదా లంచం తీసుకుంటూ పట్టుబడిన సందర్భాలలో కేసులు నమోదు చేస్తారు. కేసు నమోదు చేసిన తర్వాత ఆరు నెలల కాలవ్యవధిలోనే ఉద్యోగులు తిరిగి విధులలో చేరిపోతున్నారు. మరీ కొందరైతే పదోన్నతులు సైతం పొందుతున్నారు. ఇటువంటి చర్యల కారణంగా అవినీతికి పాల్పడుతున్న వారికి భయం లేకుండా పోవడంతోపాటు మరికొందరు అక్రమ సంపాదన వైపు దృష్టిసారిస్తున్నారు.

ఇందుకు ఉదాహరణగా నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని పేర్కొనవచ్చు. ఇంతకు ముందు ఇక్కడ మునిసిపల్ కమీషనర్‌గా పనిచేసిన చార్లెస్ ఉమాపతి 50వేల రూపాయల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. అలాగే ఇదే కార్యాలయంలో ఇన్‌చార్జి రెవిన్యూ అధికారిగా పనిచేసిన సయ్యద్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అయితే ఆరు నెలలు తిరగక మునుపే చార్లెస్ ఉమాపతికి జాయింట్ డైరక్టర్‌గా పదోన్నతి కల్పించి హైదరాబాద్‌లోని మునిసిపల్ డైరక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం జరిగింది. నెల్లూరు ఎసిబి కోర్టులో కేసు నడుస్తున్నా మరో ఉద్యోగి ఉద్యోగం చేస్తూ నవంబర్ 30వ తేదీన పదవీ విరమణ కూడా చేశారు. ఆర్ఓ సయ్యద్ కూడా నెల్లూరు మునిసిపల్ కార్యాలయంలో తిరిగి ఉద్యోగం సంపాదించుకున్నాడు.

> "నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేసే శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చేస్తున్న అవినీతి, అక్రమాలు వర్ణించనలవికావడం లేదు"

ఈ నెల 2వ తేదీ మరో శానిటరీ ఇన్స్‌పెక్టర్ కాంట్రాక్టు లేబర్‌కు చెల్లించాల్సిన వేతనాలు తన దగ్గర వుంచుకోవడంతో ఎసిబి అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో దాదాపు లక్షా 50వేల రూపాయలు ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. బాలాజీనగర్‌లోని శానిటరీ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడులు చేయడం కలకలం రేపింది. శానిటరీ ఇన్స్‌పెక్టర్ కాంట్రాక్టు లేబర్ వేతనాలు స్వాహా చేయడం కొత్తేమీ కాదు. చాలా సంవత్సరాల నుంచి వేతనాలు స్వాహా చేయడం కొనసాగుతూ వస్తుంది. ప్రతిరోజు విధులకు హాజరుకాకపోయినా హాజరైనట్లు మస్టర్ వేస్తారు. మూడు నెలలు లేదా ఆరు నెలలకోసారి కార్పొరేషన్ వేతనాలు మంజూరు చేస్తుంది. మంజూరు చేసిన వేతనాలను విధులకు హాజరైన పనిదినాలకే చెల్లించి మిగిలిన సొమ్మును శానిటరీ ఇన్స్‌పెక్టర్లు స్వాహా చేస్తుంటారు. స్వాహా చేసిన సొమ్ములో కమిషనర్, హెల్త్ ఆఫీసర్లకు సైతం వాటాలు పంచుతుండడంతో ఈ వ్యవహారంలో వీరు నోరుమెదపడం లేదు.

లేబర్ సొసైటీలు, కాంట్రాక్టు కార్మికుల కడుపులు కొడుతున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ల భాగోతం ఎసిబి అధికారులు చేసిన దాడుల్లో బయటపడింది. నగరంలోని వీధులను శుభ్రంచేసి, మలినాన్ని ఎత్తివేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు సిబ్బంది వేతనాలను స్వాహా చేయాలన్న ఆలోచన రావడమే క్షమించరాని విషయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటే బాగుంటుంది.



# నెల్లూరీయులను వణికిస్తున్న జ్వరాలు

పేరు గొప్ప ఊరుదిబ్బ చందంగా వుంది నెల్లూరు నగర పరిస్థితి. పట్టణం నుంచి నగర హోదా సంతరించుకున్నా ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం పాలకులు, అధికారగణం విఫలమయ్యారనే చెప్పాలి. పేరుకపోయిన చెత్తకుప్పలు, అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ ఎటుచూసినా, ఏ మూల చూసినా దర్శనమిస్తుంటాయి. దోమల బెడద నగర ప్రజలను పట్టిపీడిస్తోంది. విషజ్వరాలు, చికున్‌గున్యా, డెంగ్యూ లాంటి ప్రాణాంతక రోగాలు ప్రబలుతున్నా మునిసిపల్ కార్పొరేషన్ పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆస్పత్రుల పాలు కావాల్సి వస్తోంది. ఇప్పటికే అధికసంఖ్యలో ప్రజలు డెంగ్యూ వ్యాధిసోకి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నగరంలో పలువురు డెంగ్యూతో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కొండాయపాళెం ప్రాంతానికి చెందిన ధీరజ అనే విద్యార్థిని డెంగ్యూ వ్యాధితో ప్రాణాలు విడిచింది. మరెందరో చికున్‌గున్యాతో అల్లాడిపోతున్నారు. రామచంద్రారెడ్డి హాస్పిటల్, జయభారత్ హాస్పిటల్‌లలో వందల సంఖ్యలో రోగులు చికిత్స పొందుతున్నారంటే ఎంతగా ఇవి ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయో తెలుస్తుంది. ఇంతగా ప్రజలు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నా మునిసిపల్ కార్పొరేషన్ పాలకులకు, అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవడంతో ఈ వ్యాధులను అరికట్టేందుకు, నివారించేందుకు చేపడుతున్న చర్యలు శూన్యం. మరోవైపు జనవిజ్ఞాన వేదికకు చెందిన డాక్టర్ల బృందం నగరంలో ఇప్పటికే డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధుల తీవ్రత ఎక్కువగా వుందని, అధికసంఖ్యలో రోగులు చికిత్స అందుకొంటున్నారని దీనిని నిరూపించడానికి సిద్ధంగా వున్నామని ప్రకటించినా అధికారగణంలోకానీ, పాలకుల్లోగానీ స్పందన లేదు. మునిసిపల్ కార్పొరేషన్ పాలకుల వైఖరిని నిరసిస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ విభాగం రోగులను పరీక్షించి వినూత్నంగా నిరసన తెలియజేశారు. సిపిఎం తదితర పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఇంతచేసినా రోజురోజుకు దోమల బెడద ఎక్కువవుతూనే వుంది. పారిశుధ్య పరిస్థితులు ఏమాత్రం మెరుగుపడలేదు. దీంతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూనే వుంది. దీనిపై వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి.



నెల్లూరు రామచంద్రారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు.



### ఆస్పత్రిపాలయ్యా!

దోమల కారణంగానే డెంగ్యూ, చికున్‌గున్యాలు ప్రబలుతున్నాయి. తీవ్రమైన ఒళ్లునొప్పులతో బాధపడుతున్నాను. రక్తపరీక్షలో ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు తెలియడంతో డెంగ్యూ వ్యాధిగా డాక్టర్లు నిర్ధారించారు. దానికి తగిన చికిత్స తీసుకొంటున్నాను. సకాలంలో వైద్యచికిత్స చేయించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

- మహేంద్ర, నెల్లూరు.



### అధిక సంఖ్యలో వున్నారు

జిల్లావ్యాప్తంగా పలువురు విషజ్వరాలు, గున్యాలతో బాధపడుతున్నారు. విపరీతమైన జ్వరం, భరించలేని నొప్పులు రావడంతో ఆస్పత్రిలో చేరాను. చికున్‌గున్యా అని తేలింది. ఈ బాధ భరించలేకుండా వుంది. అధికారులు స్పందించి ఈ ప్రజలు వ్యాధుల బారినపడకుండా చర్యలు చేపట్టాలి.

- రమణారెడ్డి, కోడూరు.



### అల్లాడుతున్న జనం

నెల్లూరు నగరంలో పలు ప్రాంతాల ప్రజలు డెంగ్యూ, చికున్‌గున్యా బారిన పడుతున్నారు. ఈ వ్యాధి బారినపడే వారి సంఖ్య రోజురోజుకు అధికం అవుతున్నది. ఆస్పత్రుల్లో చూస్తే ఎందరు ఈ రోగాల బారినపడింది తెలుస్తుంది. అధికారులు డెంగ్యూ, చికున్‌గున్యాలు లేవంటున్నారు. మేము నిరూపించడానికి సిద్ధంగా వున్నాం.

- డాక్టర్ రమణయ్య, జనవిజ్ఞాన వేదిక.

# తిక్కనను విస్మరిస్తే చరిత్ర క్షమించదు

నెల్లూరీయులు మేధావులనీ, నెరజాణలనీ ఆది నుంచి పేరు. ఈ రోజు నెల్లూరు పేరు నలుగురికీ తెలిసిందంటే అది కొట్టరువు తిక్కన మహాకవి చలువ. సాహిత్యచరిత్రలో తిక్కన, శ్రీనాధమహాకవి, మహాకవయిత్రి మొల్లమ్మ నెల్లూరు పేరు ప్రఖ్యాతుల చిరస్మరణీయతకు నాంది పలికారు.

మహాభారతం పద్దెనిమిది పర్వాలలో పదిహేను పర్వాలు రాసి నెల్లూరుకు ఎనలేని కీర్తి తెచ్చిన తిక్కన, అరణ్యపర్వశేషాన్ని పూరించిన ప్రబంధపరమేశ్వరుడు గుడ్లూరు ఎర్రాప్రెగ్గడ, పద్దెనిమిది మహాకావ్యాల సృష్టికర్త స్వర్ణాభిషేకాలు పొందిన శ్రీనాధమహాకవి, ఆపాతమధురంగా రామాయణాన్ని రాసిన ఆతుకూరి మొల్లమ్మ నెల్లూరు మండలం వారే! దేశంలో, రాష్ట్రంలో ఎవరైనా స్వాభిమానంతో ప్రాంతీయ సాహిత్యవేత్తల శిలావిగ్రహ ప్రతిష్ఠాపనతో ఆయా మహనీయుల పట్ల ఎనలేని భక్తి ప్రపత్తుల్ని చాటుతున్నారు. ఆ అభిమానం, ఆ శ్రద్ధ నెల్లూరీయులు మచ్చుకకు కూడా వ్యక్తపరచడం లేదన్నది నా బాధ - నా వ్యథ.

కర్నాటక రాష్ట్రంలో, తమిళనాడులో మీరెక్కడికైనా వెళ్లండి అక్కడ మీకు మహాకవుల విగ్రహాలు కూడళ్లలో కనిపిస్తాయి. అంతెందుకు రాజమండ్రివాసులు నన్నయను ప్రతిష్ఠించుకున్నారు. యూనివర్శిటీని నన్నయపీఠంగా పిలుచుకుంటున్నారు. తాళ్లపాక వారు అన్నమయ్యను ప్రతిష్ఠించుకున్నారు. ఈ మాత్రం అభిమానం నెల్లూరీయులకు లేదా? అంతటి అభిమానులు కరువయ్యారా? మన సంస్కృతిని, మన కవుల్ని స్మరించుకొనే ఔన్నత్యం మనకు లేదా? జక్కన, బైచరాజు వెంకటనాధుడు, మారన, మూలఘటిక కేతన, కంకంటి పాపరాజు (మోడేగుంట), పుష్పగిరి తిమ్మన (ప్రళయకావేరి), దూబగుంట నారాయణకవి వంటి కవి ఉద్దండులు లెక్కవేస్తే నూట ఇరవైఆరుగురు వున్నారు. కనీసం తిక్కన, శ్రీనాధుడు, మొల్లమ్మ విగ్రహప్రతిష్ఠ చేసి తిక్కన సర్కిల్, శ్రీనాధు సర్కిల్, మొల్లమ్మ సర్కిల్ అని పిలుచుకొంటే ఎంత ఆనందంగా వుంటుంది. ఎంతతృప్తిగా వుంటుంది. నెల్లూరు రాజకీయ నాయకుల్ని తప్ప సాహిత్యకారుల్ని పట్టించుకున్నట్లు లేదు. మొన్నటికి మొన్న కలువాయి మండలం గోప



వరం నివాసి అయిన మహాకవయిత్రి ఆతుకూరి మొల్లను కడప రచయిత్రిగా కడప మిత్రులు ప్రకటించుకుంటే నెల్లూరు రచయితలకు కానీ, రచయితల సంఘాలకు కానీ చీమకుట్టినట్టైనా లేదు. అబద్ధపు ప్రకటనలతో నెల్లూరు సాహిత్య చరిత్రపై కడప సాహితీ మిత్రులు దాడి చేస్తే నెల్లూరీయులు నిమ్మకు నీరెత్తినట్లున్నారు. రేపు తిక్కనను కూడా గుంటూరు వారు మా వాడంటారు అప్పుడు మనకు ఈ పరిస్థితేనా? ఇప్పటికైనా నెల్లూరీయులు మగత నిద్ర నుండి మేలుకోవడం మంచిది. ఇప్పటికే నెల్లూరుజిల్లా చారిత్రక సంపద శిథిలమై నామరూపాల్లేకుండా పోయింది.

ప్రభగిరిపట్నం, మన్నారు పోలూరు, కృష్ణపట్నం సిద్దేశ్వరాలయం, ఉదయగిరి కోట, అందులోని దేవాలయాలు, గండవరం ఆలయాలు, భైరవకోన, మల్లాం ఆలయాలను సంరక్షించుకోడానికి నెల్లూరీయులు ఉద్యమం చేయాల్సివుంది. కొన్ని ఆలయాల పునరుద్ధరణకు కొన్ని నిధులు మంజూరయ్యాయి. నెల్లూరు బైపాస్‌కూడలిలో అన్నమాచార్యుల విగ్రహప్రతిష్ఠకు కొందరు మిత్రులు పూనుకొన్నారని విన్నాను మంచిదే. జగద్విఖ్యాత పదకీర్తనాచార్యుణ్ణి నెల్లూరీయులు గౌరవిస్తే అది మన విశాల హృదయతత్వానికి నిదర్శనమౌతుంది. అయితే తనకుమాలిన ధర్మము మొదలు చెడ్డ బేరము కదా? అంతకు ముందు వీళ్లమనసులో తిక్కన, శ్రీనాధుడు, మొల్లమ్మలు స్ఫురించి వుంటే బాగుండేది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సరస్వతీదేవి పోతనామాత్యునికి కలలో కనిపించి కన్నీళ్లు పెట్టుకొన్నట్టు, తిక్కన, శ్రీనాధ, మొల్లమ్మలు కూడా నెల్లూరీయుల ముందు కన్నీళ్లు పెట్టుకోకముందే మత్తువదిలించుకొని, సుషుప్తావస్థ నుంచి మేల్కొని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి శ్రీకారం చుడతారని ఆశిస్తున్నాను.

అలాగే నెల్లూరులో పెట్టిన యూనివర్శిటీకి తిక్కన విశ్వవిద్యాలయంగా పేరు స్థిరీకరించాలని, అందుకు నెల్లూరీయులు, సాహితీసంస్థలు అధికారగణంపై ఒత్తిడి తేవాలని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

**పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**

# శ్రద్ధాంజలి





జననం
09-09-1928



మరణం
05-12-2009

మమతానురాగాల అమృతమూర్తి, మా తల్లిగారైన

## శ్రీమతి గునుపాటి లక్ష్మీకాంతమ్మ గారు

( స్వర్గీయ గునుపాటి రామచంద్రారెడ్డి గారి ధర్మపత్ని)

తేది 05-12-2009 శనివారంనాడు స్వర్గస్తులైనారు.

వారి ఆత్మకు సదాశాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

**ఉత్తరక్రియలు :** తేది 14-12-2009 సోమవారంనాడు పెద్దకర్మ ( కర్మంత్రం)
హైదరాబాదు, రోడ్డు నెం. 12, బంజారాహిల్స్‌లోని మా స్వగృహమునందు జరుగును.

కావున బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేయడమైనది.

కుమారులు - కోడళ్లు
గునుపాటి పద్మనాభరెడ్డి - అరుణ
గునుపాటి శ్రీధర్‌రెడ్డి - ఉమ

మరియు
మనుమలు,
మనుమరాళ్లు

కుమార్తెలు - అల్లుళ్లు
రాజేశ్వరి - టి. రాజగోపాల్‌రెడ్డి
వసుంధర - ఆర్. ద్వారకనాథ్‌రెడ్డి
శారద - బి. కుమారస్వామిరెడ్డి

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.